# బలగం BALAGAM TV

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 19 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత దామోదర్ మృతి

బలగం టీవీ, హైదరాబాద్



తెలంగాణ మావోయిస్టు పార్టీ సెక్రటరీ దామోదర్ అలియాస్ బడే చొక్కారావు పోలీసుల కాల్పుల్లో మృతిచెందారు. ఛత్తీస్‌గఢ్‌లో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయన మృతిచెందినట్లు మావోయిస్టు పార్టీ ఓ లేఖను విడుదల చేసింది. ఎన్‌కౌంటర్‌లో దామోదర్‌తో పాటు మరో 17 మంది మరణించారు. దామోదర్ స్వస్థలం ములుగు జిల్లా కాల్వపల్లి. దాదాపు 30 ఏళ్లుగా ఆయన మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నారు. ఎన్నో ఏండ్లుగా ఆయన పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నారు. ఆయనపై ఛత్తీస్‌గఢ్‌లో50 లక్షల రివార్డు కూడా ఉంది. తెలంగాణలోనూ 25లక్షల రివార్డు ఉంది. ఆరు నెలల క్రితమే ఆయన మావోయిస్టు పార్టీ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించారు. మావోయిస్టు యాక్షన్ టీమ్‌లకు ఆయన ఇన్‌చార్జిగానూ ఉన్నారు.

## ఉగాది నుంచి 'గద్దర్' అవార్డులు



- వేగంగా ఏర్పాటు చేసుకోవాలి
- ఫీచర్ సినిమాలు, బాలల చిత్రాలు, తెలుగు సినిమాపై పుస్తకాలు తదితర వివిధ విభాగాల కింద అవార్డులు ఇవ్వాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

బలగం టీవీ, హైదరాబాద్

ఈ ఏడాది ఉగాది పండుగ నుంచి గద్దర్ చలనచిత్ర అవార్డుల ను తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కమిటీ సభ్యులు, అధికారులు వేగంగా ఏర్పాటు పూర్తి చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో గద్దర్ అవార్డుల కమిటీ శనివారం సమావేశం జరిగింది. అవార్డుల కోసం లోగోతో సహా విధివిధానాలు, నియమ నిబంధనలపై కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాషలో నిర్మించిన ఉత్తమ చిత్రాలను గుర్తించి, ప్రశంసిస్తూ అవార్డులు అందించనున్నట్లు తెలిపారు.జాతీయ సమైక్యత, ఐక్యతను పెంపొందించే సాంస్కృతిక, విద్యా, సామాజిక ఔచిత్యం కలిగిన అత్యున్నత సాంకేతిక నైపుణ్యం, మానవతా విలువలతో కూడిన చిత్రాల నిర్మాణాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డుల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జాతీయస్థాయి కార్యక్రమాల తరహాలో నిర్వహించాలని భట్టి సూచించారు. సినిమా నిర్మాణంలో హైదరాబాద్‌ను ప్రపంచ గమ్యస్థానంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేవంత్ రెడ్డి నాయకత్వంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సినిమాల నిర్మాణాన్ని ప్రోత్సహించే అవార్డులను ప్రతి ఏటా అందజేయాలని నిర్ణయించి గద్దర్ తెలంగాణ సినిమా అవార్డులు ఈ ఉగాది నుంచి ప్రతి సంవత్సరం ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

ఫీచర్ సినిమాలు, బాలల చిత్రాలు, తెలుగు సినిమాపై పుస్తకాలు తదితర వివిధ విభాగాల కింద అవార్డులు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. అవార్డుల్లో నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం కూడా అందజేయనున్నట్లు చెప్పారు. గద్దర్ అవార్డుకు సంబంధించి లోగోను కూడా రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు, ఎండీ డాక్టర్ హరీశ్, ఈడీ కిశోర్‌బాబు, కమిటీ చైర్మన్ బీ నర్సింగ్‌రావు, కమిటీ సభ్యులు జయసుధ, తమ్మారెడ్డి భరద్వాజ్, హరీశ్ శంకర్, వందేమాతరం శ్రీనివాస్, గుమ్మడి వెన్నెల, అల్లాణి శ్రీధర్, వేణు పాల్గొన్నారు.

# పెట్టుబడులు, భాగస్వామ్యాలపై చర్చలు

- ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవంపై చర్చ
- శాస్త్ర సాంకేతిక రంగాల్లో కలిసి పని చేసేందుకు అంగీకారం
- సింగపూర్ వాణిజ్య శాఖమంత్రితో సీఎం రేవంత్ భేటీ



బలగం టీవీ, హైదరాబాద్

సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఆ దేశ పర్యావరణ శాఖ మంత్రి గ్రేస్ ఫు హైయిన్‌తో సమావేశమయ్యారు. తెలంగాణలో ఉన్న అపార పెట్టుబడి అవకాశాలు, భాగస్వామ్యాలపై ఈ సమావేశంలో ఇరుపక్షాల మధ్య విస్తృత చర్చలు జరిగాయి. ముఖ్యంగా పట్టణాభివృద్ధి ప్రణాళిలు, మౌలిక సదుపాయాల కల్పన, నీటి వనరులు-నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధి, క్రీడలు, సెమీ కండక్టర్లు, తయారీ, పర్యావరణం, స్థిరత్వ, సాంకేతికత సహా వివిధ రంగాలలో తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, భాగస్వామ్యాలపై చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయి. ఈ చర్చల్లో ముఖ్యమంత్రి వెంట ఐటీ అండ్ పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్రానికి చెందిన ఉన్నతాధికారులు, సింగపూర్‌లో భారత డిప్యూటీ హై కమిషనర్ పూజ ఎం.టిల్లు గారు పాల్గొన్నారు.

తెలంగాణ రైజింగ్ లక్ష్యాలు, ఆ మేరకు ప్రజా ప్రభుత్వం అనురిస్తున్న కార్యాచరణ పట్ల సింగపూర్ మంత్రి గ్రేస్ ఫూ హైయిన్ గారు ఆసక్తి కనబరిచారు.

??ప్రధానంగా నెట్ జీరో ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్, నీటి నిర్వహణ, స్థిరత్వ ప్రణాళికల్లో తెలంగాణతో భాగస్వామ్యం అంశాన్ని సింగపూర్ ప్రభుత్వం పరిశీలిస్తుందని వారు హామీ ఇచ్చారు. ఉమ్మడి ప్రాజెక్టులపై సాధ్యమైనంత వేగంగా ముందుకు పోవాలని, మరింత సమన్వయంతో పని కలిసి చేయాలని ఇరుపక్షాలు అంగీకరించాయి.

సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అక్కడి తెలంగాణ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి గారి వెంట మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి గారు, ఎమ్మెల్యే కుందూరు జయవీర్ గారు, హైదరాబాద్ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రోహిణ్ రెడ్డి గారు ఉన్నారు. సింగపూర్ గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ కల్చరల్ సొసైటీ(సింగపూర్) అధ్యక్షుడు గడప రమేశ్ బాబు గారు, సొసైటీ కార్యవర్గంతో పాటు పెద్ద సంఖ్యలో తెలంగాణ ప్రవాసులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో మరో ఏఐ డేటా సెంటర్..

- రూ.3500 కోట్ల పెట్టుబడులు..
- ఎస్టీటీ కీలక ఒప్పందం



బలగం టీవీ, హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్ పర్యటన సందర్భంగా మరో కీలకమైన ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో రూ. 3,500 కోట్ల పెట్టుబడులకు ST Telemedia Global Data Centres India సంస్థ ముందుకు వచ్చింది. ముచ్చర్ల - మీర్ఖాన్‌పేటలో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్ క్యాంపస్‌ను స్థాపించేందుకు ఈ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది.

ఈ అవగాహన ఒప్పందంపై ముఖ్యమంత్రి స్పందిస్తూ త్వరలోనే హైదరాబాద్ డేటా సెంటర్లకు రాజధానిగా అవతరిస్తుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పెట్టుబడుల నిర్ణయం తీసుకున్నందుకు ఎస్టీటీ గ్లోబల్ కంపెనీ ప్రతినిధులను అభినందించారు. ప్రపంచ వ్యాప్తంగా ఏఐ ఆధారిత రంగంలో వస్తున్న వినూత్న మార్పుల్లో హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్‌గా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

మంత్రి డి.శ్రీధర్ బాబు సింగపూర్‌లోని ఎస్టీటీ గ్లోబల్ డేటా సెంటర్‌ను సందర్శించి ఆ సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అనంతరం పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎస్‌టీటీ గ్రూప్ సీఈవో బ్రూనో లోపెజ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. 100 మెగావాట్ల సామర్థ్యంతో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే అత్యాధునిక ఏఐ రెడీ డేటా సెంటర్‌ను ఈ కంపెనీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పనుంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా డేటా సెంటర్ సామర్థ్యాన్ని పెంచుకునే సదుపాయం ఇందులో ఉంటుంది. దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్లలో ఇది ఒకటిగా నిలుస్తుంది.

తెలంగాణతో కలిసి పని చేయటం గౌరవంగా ఉందని ఎస్టీటీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్స్ ప్రెసిడెంట్, గ్రూప్ సీఈవో బ్రూనో లోపెజ్ గారు అన్నారు. మౌలిక సదుపాయాలతో పాటు తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రగతిశీల విధానాలు సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సాహకంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం అందించే సహకారంతో ఆర్థిక వృద్ధితో పాటు ఉపాధి కల్పన, స్థిరమైన డిజిటల్ భవిష్యత్తు నిర్మించాలనే ఉమ్మడి లక్ష్యం నెరవేరుతుందని అన్నారు.

ప్రస్తుతం ఎస్‌టీటీ జేడీసీ హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో డేటా సెంటర్‌ను నిర్వహిస్తోంది. కొత్త క్యాంపస్ ఏర్పాటుతో కంపెనీ కార్యకలాపాలను విస్తరించనుంది. ఈ కంపెనీ దేశంలో వచ్చే పదేండ్లలో దాదాపు 3.2 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఒక గిగావాట్ సామర్థ్యానికి విస్తరించాలన్న లక్ష్యంతో పెట్టుబడులు పెడుతోంది.

## కేజ్రీవాల్ కారుపై దాడి...



బలగం టీవీ, హైదరాబాద్

ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధిపతి, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కారుపై దాడి జరిగింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన ఉన్న వాహనంపై రాళ్లు విసిరారు. బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ గూండాల పనిగా ఆప్ ఆరోపించింది. అయితే దీనిని ఆయన ఖండించారు. కేజ్రీవాల్ కారు ఇద్దరు యువకులను ఢీకొట్టిందని విమర్శించారు.

న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అరవింద్ కేజ్రీవాల్ శనివారం ఆ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు వ్యక్తులు ఆయన వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అలాగే అరవింద్ కేజ్రీవాల్ ఉన్న కారుపై రాళ్లు విసిరారు. అప్రమత్తమైన పోలీసులు కేజ్రీవాల్ కారును అక్కడి నుంచి పంపివేశారు.కాగా, అరవింద్ కేజ్రీవాల్ కారుపై దాడికి సంబంధించిన వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో ఆప్ పోస్ట్ చేసింది. బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ గూండాలు ఈ చర్యకు పాల్పడినట్లు ఆరోపించింది. 'ఓటమి భయంతో బీజేపీ ఆందోళన చెందుతోంది. అరవింద్ కేజ్రీవాల్‌పై దాడికి తన గూండాలను ఉపయోగించింది. అరవింద్ కేజ్రీవాల్ ప్రచారం చేస్తున్నప్పుడు బీజేపీ అభ్యర్థి

మిగితా 2వ పేజీలో

## అద్దె ఇళ్లల్లో నివసించే వారికీ ఫ్రీ కరెంట్, నీరు

- ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్



బలగం టీవీ, న్యూఢిల్లీ

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార ఆమ్‌ఆద్మీ దిల్లీ ప్రజలకు వరుస హామీలను ప్రకటిస్తోంది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తాజాగా మరో హామీని ప్రకటించారు. తమ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశ రాజధానిలోని అద్దె ఇళ్లల్లో నివసించే వారికి ఉచిత విద్యుత్, నీరు అందిస్తామని పేర్కొన్నారు. పూర్వాంచల్‌కు చెందిన అనేక మంది కౌలుదారులకు సైతం ఉచిత విద్యుత్, నీటి సౌకర్యాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

"నేను దిల్లీలో ఎక్కడికి వెళ్లినా కిరాయిదారులు నాతో ఇలా చెబుతారు. మీ పాఠశాలల వల్ల మేం లబ్ధి పొందుతున్నాం. మొహల్లా క్లినిక్స్, ఆస్పత్రుల వల్ల, ఉచిత బస్సు సేవలు, ఉచిత తీర్థయాత్ర సేవలు పొందుతున్నామని చెబుతారు. కానీ ప్రభుత్వం నుంచి ఉచిత విద్యుత్, నీళ్లు మాకు రావడం లేదని వాపోతున్నారు. నేను ఏం చెప్పదలచుకున్నానంటే ఈ ఎన్నికల్లో మా ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే కిరాయిదారుల కోసం పథకాలు, వ్యవస్థను తీసుకొస్తాం. వాటి నుంచి కిరాయిదారులకు విద్యుత్, నీళ్లు ఉచితంగా వస్తాయి" అని అన్నారు.

## ప్రజా పాలన దరఖాస్తులు చెత్తబుట్టలో వేశారు

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం

బలగం టీవీ, హైదరాబాద్

ప్రజా పాలన దరఖాస్తులు చెత్తబుట్టలో వేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 26 జనవరి నుంచి కొత్తగా పలు సంక్షేమ పథకాలు ప్రారంభిస్తామని చెబుతున్న ప్రభుత్వ తీరు చూస్తే పేదలకు సంక్షేమ పథకాలు ఎలా అందించాలనే దాని కంటే కోతలు ఎలా పెట్టాలి అనే చూస్తున్నట్లుంది. అందరికి పరమాన్నం అని చెప్పి, అధికారంలోకి రాగానే పంగ నామాలు పెడుతున్నడు రేవంత్ రెడ్డి. ఆరు గ్యారెంటీల్లో మొదటి హామీ మహాలక్ష్మి అమలు కాలేదు, చివరి హామీ చేయూతకు దిక్కు లేదు మధ్యలో ఉన్న అన్ని హామీలదీ దాదాపు అదే పరిస్థితి. అన్నింట్లో కోతల విధింపే. దేవుళ్ల మీద ఒట్లు పెట్టి మోసం చేసింది చాలదన్నట్లు, జనవరి 26 రాజ్యాంగం అమలు లోకి వచ్చిన రోజున ప్రారంభించే కార్యక్రమాల్లోనూ ప్రజలను మోసం చేస్తున్నారు. ఇది చాలా దుర్మార్గం. రేషన్ కార్డుల విషయంలో రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాస్తున్నాం. ప్రజలు తీవ్ర ఆగ్రహ ఆవేశాలతో ఉన్నరు. పాపం రేవంత్ రెడ్డిది, శాపం అధికారులకు రేషన్ కార్డుల ఎంపిక గ్రామాల్లో జరగాలి. కుల గణన సర్వేను బేస్ చేసుకొని, ఆ లిస్టును మాత్రమే ప్రింట్ తీసి గ్రామాలకు

వివరాలు 2వ పేజీలో



## హైడ్రా కొత్తదేం కాదు..పాతదే

- చెరువులు కబ్జా చేస్తే చర్యలు తప్పవని ముందు నుంచే ఉంది
- నాకు జాతీయ అధ్యక్ష పదవి అనేదానిపై పార్టీదే నిర్ణయం
- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్

'హైడ్రా కొత్తదేం కాదు.. పేరు మారిస్తే అది కొత్త చట్టమా? చెరువులను కబ్జా చేస్తే చర్యలు తప్పవనేది ముందు నుంచే ఉంది' అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో కిషన్‌రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తన శాఖ పరిధిలోని ఆరు లక్షల మంది కార్మికులకు ఒక్కొక్కరికి కోటి రూపాయల ఇన్సూరెన్స్‌ను త్వరలో ఇవ్వబోతున్నామని తెలిపారు. గనులు జాతీయ సంపద కాబట్టి రాష్ట్రాలకు హక్కు ఉండదనీ, త్వరలో వాటిని కేంద్రం పరిధిలోకి తీసుకుంటామని చెప్పారు. రాజకీయంగా తమ ప్రధాన శత్రువు కాంగ్రెస్ అని స్పష్టం చేశారు. 'మూసీ సుందరీకరణ చేయాల్సిందే. కానీ, పేదల ఇండ్లను కూలగొట్టొద్దన్నదే మా డిమాండ్. ఇప్పుడున్న కాల్వల్లో కృష్ణా, గోదావరి నీళ్లు పారించాల్సిందే. నల్లగొండ జిల్లాకు సాగునీరు అందిం చాల్సిందే. విధివిధానాలు, ఫ్రేం వర్క్ రూపొందించిన తర్వాత అది ఆమోదం పొందితే మూసీ సుందరీకరణకు తప్పనిసరిగా నిధులు ఇస్తాం' అని చెప్పారు. తమ పార్టీలో అధ్యక్ష పదవి చేపట్టాలంటే రెండుసార్లు క్రియాశీల సభ్యత్వం పొందటం తప్పనిసరని తేల్చారు. ఆ నిబంధన ప్రకారం ఈటలకు అధ్యక్ష పదవి లేనట్టేనా అని అడగ్గా.. ఆయన ఇప్పటికే హుజూరాబాద్ బైపోల్, గజ్వేల్, హుజూరాబాద్ అసెంబ్లీ, మల్కాజిగిరి ఎంపీ ఎన్నికల్లో పోటీ చేశారు కాబట్టి ఆయన అర్హుడే అని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

మండల, జిల్లా, రాష్ట్ర కమిటీల్లో మహిళలకు 33 శాతం పదవులు ఇవ్వబోతున్నామనీ, కొన్ని చోట్ల ఒకటెండ్రు శాతం అటూఇటూగా ఉండొచ్చని కూడా చెప్పారు. 50 శాతం కంటే ఎక్కువ మంది బీసీలకు మండల కమిటీ అధ్యక్షులుగా నియమిస్తున్నామనీ, మండలాధ్యక్షులు 45 ఏండ్లలోపు వారే ఉండాలనే నిబంధన పెట్టుకోవడంతో యువరక్తం తమకు ప్లస్ కాబోతున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ ఒంటరిగా పోటీ చేస్తామనీ, వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలుస్తామని చెప్పారు. జీతాలిచ్చేందుకే డబ్బుల్లేని కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలను ఏ విధంగా అభివృద్ధి చేస్తుందని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీలో ఏడు నెలలుగా వీధిదీపాల ఏర్పాటుకు నిధుల కొరత ఉందన్నారు. ఢిల్లీలో బీజేపీ ఉచితాల హామీలపై ప్రశ్నించగా...ఉచిత పథకాలకు వ్యతిరేకమని తమ పార్టీ ఎప్పుడూ చెప్పలేదనీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆధారంగా హామీలు ఇవ్వాలన్నదనే తమ విధానం అని చెప్పారు. జీఎస్టీ నిబంధనల ప్రకారమే రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తున్నామనీ, ఎక్కువ, తక్కువ ఇవ్వడం, వివక్ష చూపడం వంటిదానికి తావేలేదని స్పష్టం చేశారు. విభజన చట్టం ప్రకారమే ఏపీకి

వివరాలు 2వ పేజీలో

## అర్హులందరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

- జిల్లా కలెక్టర్లతో మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్



బలగం టీవీ, హైదరాబాద్

అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. రేషన్ కార్డుల జారీ ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరం ప్రక్రియాని చివరి లబ్ధిదారుల వరకు అందిస్తామని ప్రకటించారు. ఇందులో ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అని అన్నారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారిచేసింది. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న రేషన్ కార్డ్ ల లబ్ధిదారుల జాబిత కులగణన (సామిజిక) సర్వే ఆధారంగా తయారు చేసిందని ఇది తుది జాబితా కాదని పేర్కొంది.ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, గ్రామ సభల నిర్వహణ, తదితర అంశాలపై శనివారం డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతుంది. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో దరఖాస్తులను స్వీకరించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా కూడా కొత్త రేషన్ కార్డులకు లేదా కొత్త సభ్యుల చేర్పులకై దరఖాస్తులు కూడా స్వీకరించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే , గతంలో జరిగిన ప్రజాపాలన సదస్సులలో స్వీకరించిన దరఖాస్తుల జాబితాలో అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పురోగతిలో ఉందని తెలిపారు.

ఈనెల 26 ప్రారంభించే నాలుగు పథకాలపై 21వ తేదీ నుండి ప్రారంభమయ్యే గ్రామసభల్లో ప్రజా అభిప్రాయలు/ ఫీడ్ బ్యాక్ లను తీసుకోవడంతో పాటు ఈ గ్రామ సభలు, ప్రజా పాలన సేవా కేంద్రాలలో కొత్తగా తీసుకున్న దరఖాస్తులు, ఎండీఓ కార్యాలయంలో ఇప్పటికే ఉన్న దరఖాస్తులను తగు రీతీలో పరిశీలించిన తర్వాత మాత్రమే అర్హులైన లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందని మంత్రులు స్పష్టం చేశారు. అర్హులైన తుది జాబితాలను ప్రకటించడానికి ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీచేయడం జరుగుతుందని తెలియ చేశారు.ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇంటి స్థలం ఉన్న వారి జాబిత ఇంటి స్థలం లేని వారి రెండు జాబితాలను గ్రామ సభలలో ప్రదర్శించాలని, అలాగే కొత్తగా గ్రామ సభలలో వచ్చే దరఖాస్తులను కూడా పరిశీలించాలని సూచించారు. రాష్ట్రం లో అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులను ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు.రేషన్ కార్డుల మంజూరికి గాను దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ నిరంతరం కొన సాగుతుందని వారు స్పష్టం చేశారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతీ భూమికి రైతు భరోసా కల్పించడం జరుగుతుందని అన్నారు. గతంలో వివిధ ప్రాజెక్టులకు,

వివరాలు 2వ పేజీలో

## గ్రూప్-2 ప్రాథమిక 'కీ' విడుదల

బలగం టీవీ, హైదరాబాద్




రాష్ట్రంలో గ్రూప్-2 పోస్టుల భర్తీకి నిర్వహించిన రాత పరీక్షల ప్రాథమిక 'కీ'ని టీజీపీఎస్సీ విడుదల చేసింది. ప్రిలిమినరీ 'కీ'తో పాటు మాస్టర్ ప్రశపత్రాన్ని ఈ నె 22 వరకు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని సర్వీస్ కమిషన్ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ తెలిపారు. అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే 18 నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. అభ్యంతరాలను ప్రత్యేకంగా పొందుపరిచి లింక్ ద్వారా ఇంగ్లీష్‌లో నమోదు చేసి, ఆధారాలను జత చేయాలన్నారు. ఇతర పద్ధతుల్లో ఇచ్చిన అభ్యంతరాలను, గడువు తేదీ ముగిసిన తర్వాత అందిన విజ్ఞప్తులను పరిగణించబోమని స్పష్టం చేశారు.

## విద్యార్థులకు పోలీస్ అక్క అవగాహన కార్యక్రమం



**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్ల బోయినిపల్లి మండలం కోరెం ప్రాథమిక పాఠశాల యందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు మండలం ఎస్సై పృథ్వీధర్ ఆధ్వర్యంలో మహిళా సిబ్బంది పింకిల్ యాదవ్ ద్వారా బోయినిపల్లి మండల పోలీస్ అక్క ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఇట్టి ప్రోగ్రాంలో విద్యార్థిని, విద్యార్థులకు సేఫ్ టచ్ అండ్ అన్ సేఫ్ టచ్ పైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. 100 డైల్ ప్రాధాన్యతను వివరించడం జరిగింది. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 కి మరియు ఎవరైనా ఆకతాయిలు ఏడిపిస్తే షీ టీం నెంబర్ 8712656425కి గాని ఫోన్ చేయమని తెలపడం జరిగింది.

## మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి జైలు శిక్ష

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి కోర్టు జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే వేములవాడ రూరల్ సర్కిల్ పరిధిలోని బోయినిపల్లి మరియు వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గత నెలలో వివిధ సందర్భాలలో జరిపిన వాహనాల తలఖీలలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 32 మంది డ్రైవర్లపై చార్జి షీటు దాఖలు చేసి, శనివారం రోజున వేములవాడ కోర్టులో న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా, వారిలో ఇద్దరికీ ఐదు రోజులు జైలు శిక్షతో పాటు జరిమానా, ఇద్దరికీ రెండు రోజుల చొప్పున జైలు శిక్ష మరియు జరిమానా మరియు మిగతా 28 మందికి జరిమానా విధించారు. న్యాయమూర్తి. మొత్తంగా రూ. 64000జరిమానా విధించడం జరిగింది. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన కేసుల్లో పదిమందిని న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా ఒక్కొక్కరికి 1000 చొప్పున 10,000 రూపాయల జరిమానా విధించడం జరిగిందని వేములవాడ రూరల్ సిఐ ఎం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

## కేజ్రీవాల్ కారుపై దాడి...

(మొదటి పేజీ తరువాయి)

పర్వేష్ వర్మ గూండాలు ఇటుకలు, రాళ్లతో దాడి చేశారు. ఆయనను గాయపరిచేందుకు ప్రయత్నించారు. కేజ్రీవాల్ ప్రచారం చేయకుండా చేయాలనుకున్నారు. బీజేపీ వ్యక్తుల పిరికి దాడికి కేజ్రీవాల్ భయపడరు. ఢిల్లీ ప్రజలు మీకు తగిన సమాధానం ఇస్తారు' అని ఎక్స్‌లో పేర్కొంది.

మరోవైపు ఆప్ ఆరోపణలను బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ ఖండించారు. అరవింద్ కేజ్రీవాల్ వాహనం ఇద్దరు యువకులను ఢీకొట్టిందని ఆరోపించారు. 'ప్రజలు ప్రశ్నలు అడుగుతుండగా, అరవింద్ కేజ్రీవాల్ తన కారుతో ఇద్దరు యువకులను ఢీకొట్టారు. వారిద్దరినీ లేడీ హార్డింగ్ ఆసుపత్రికి తరలించారు. ఓటమిని ఎదురుగా చూసిన ఆయన, ప్రజల ప్రాణాల విలువను మరిచిపోయారు. నేను ఆసుపత్రికి వెళ్తున్నా' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## బ్యాంకులో పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

- బ్యాంకు అధికారులు వేధిస్తున్నారని

**అందరూ చూస్తుండగానే పురుగుల మందు తాగిన వైనం**




**బలగం టీవి, హైదరాబాద్**

ఆదిలాబాద్‌లో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. బ్యాంకు అధికారులు వేధిస్తున్నారని.. ఓ రైతు అదే బ్యాంకులో అందరూ చూస్తుండగానే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. అయితే.. రైతు ఆత్మహత్య చేసుకున్న దృశ్యాలు.. బ్యాంకులోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకులో బేల మండలం రేణి గూడకు చెందిన రైతు జాదవ్ దేవరావు ఐదెకరాల వ్యవసాయ భూమిపై మూడున్నర లక్షల రూపాయల రుణం తీసుకున్నాడు. తీసుకున్న రుణానికి గానూ.. 6 నెలలకు ఒకసారి రూ.25 వేలు వడ్డీ చెల్లించాల్సి ఉంది. అయితే గత 2 దఫాలుగా వడ్డీ చెల్లించలేకపోయాడు. సమయానికి వడ్డీ కట్టకపోవడంతో.. బ్యాంకు అధికారులు జాదవ్‌పై ఒత్తిడి తీసుకొచ్చారు. ఫోన్లు చేసి వేధించారు. అటు వడ్డీ కట్టేందుకు డబ్బులు లేక.. ఇటు బ్యాంకు అధికారులు వేధింపులు తట్టుకోలేక.. జాదవ్ తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. దీంతో శనివారం ఉదయం పురుగుల మందు డబ్బాతో బ్యాంకుకు వచ్చిన జాదవ్.. నేరుగా లోపలికి వచ్చి పురుగుల మందు తాగేసి.. బాటిల్‌ను విసిరేశాడు. అది గమనించిన సెక్యూరిటీ గార్డు తనను బయటికి వెళ్లాలంటూ వారించగా.. వెళ్లి ఆ సెక్యూరిటీ గార్డు కుర్చీలో జాదవ్ కూర్చున్నాడు. అంతలోనే మరో సిబ్బంది వచ్చి.. ఏం జరిగిందని అడగటంతో.. పురుగుల మందు తాగేసినట్టు చెప్పాడు. అప్పటికీ ఆ ఇద్దరు ఎవరికీ చెప్పకుండా వాళ్లలో వాళ్లే మాట్లాడుకున్నారు. ఓ ఉద్యోగి.. అంబులెన్సుకు ఫోన్ చేశారు. అంబులెన్స్ వచ్చిన తర్వాతే.. జాదవ్‌ను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. జాదవ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే.. బ్యాంకు సిబ్బంది టైం వేస్ట్ చేయకుండా సకాలంలో స్పందించి ఉంటే జాదవ్ కచ్చితంగా బతికేవాడని సీసీ కెమెరా వీడియోలు చూసిన పలువురు అంటున్నారు.

## జోరు జోరుగా మట్టి దందా




**బలగం టీవీ , తంగళ్లపల్లి**

మండలంలోని జిల్లెల్ల గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని జెసిబి లతో త్రవ్వుతూ టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. అధికారులు మట్టి రవాణా చేసే అక్రమార్కులపై ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ అనుమతులు లేకుండా మండలంలో మట్టిని తరలించడం శోచనియంగా మారింది. ప్రకృతి విధ్వంసం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అర్హులందరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

(మొదటి పేజీ తరువాయి)

రహదారులకు, ఇతర ప్రభుత్వ అవసరాలకు ప్రభుత్వం సేకరించిన భూముల వివరాలు తహసీల్దార్ల వద్ద ఉన్నాయని తెలిపారు.వ్యవసాయ అధికారులు, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా రైతు భరోసా లబ్దిదారులను గుర్తించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కనీసం ఇరవై రోజుల పాటు కూలి పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింప చేయడం జరుగుతుందని తెలిపారు.

ప్రతీ కుటుంబంలో మహిళల బ్యాంకు కాతాలకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్నిబదిలీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్రంలో 156 గ్రామా లను మున్సిపాలిటీలలో కలపడం జరిగిందని, ఈ గ్రామాల్లో 2023 -24 లో జరిగిన ఉపాధి హామీ పనుల జాబితాను పరిగణనలో తీసు కోవడం జరుగుతుందని వారు స్పష్టం చేశారు.

ఈనెల 21 వ తేదీ నుండి 24 వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను సి.ఎస్ శాంతి కుమారి ఆదేశించారు. గతం లో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభల మాదిరిగానే 21 నుండి జరిగే గ్రామ సభలకు కూడా చేపట్టాలని అన్నారు. ప్రతి రోజు ఒక గ్రామ పంచాయితీ లో మాత్రమే గ్రామ సభ నిర్వహించాలని, ఈ గ్రామ సభలకు హాజరయ్యే ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని స్పష్టం చేశారు.

## ప్రజా పాలన దరఖాస్తులు చెత్తబుట్టలో వేశారు

(మొదటి పేజీ తరువాయి)

పంపారు. ఆన్ లైన్ లో మీ సేవలో కొన్ని లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నరు. ప్రజా పాలన సమయంలో దరఖాస్తులు చేసారు. ఆ దరఖాస్తులు అన్నీ చెత్తబుట్టలో వేసారు. 11లక్షల దరఖాస్తులు ప్రజాపాలనలో వస్తే ఎందుకు పరిశీలించడం లేదు అని బీఆర్ఎస్ తరుపున ప్రశ్నిస్తున్నాంమీసేవా ద్వారా దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను ఎందుకు పరిశీలించడం లేదు. కుల గణన సర్వే చేసెటప్పుడు ఇది ఆప్షనల్, బలవంతం లేదు ఇష్టం ఉన్న వారు మాత్రమే పాల్గొనవచ్చు అన్నరు.

ఇప్పుడు మాత్రం దాన్ని బేస్ చేసుకొని అర్హులకు రేషన్ కార్డులు రాకుండా కోతలు పెడుతున్నరు.నా నియోజకవర్గం నంగునూరులో, గట్ల మల్యాల గ్రామంలో 110 మంది ప్రజాపాలనలో దరఖాస్తు పెట్టారు. లిస్టులో 40 మంది పేరు మాత్రమే ఉంది. అధికారులను అడిగితే హైదరాబాద్ నుంచి పేర్లు వచ్చాయి. మాకేం తెల్వదు అంటున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఆందోళనలో ఉన్నరు. కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డుల విషయంలో మా ప్రభుత్వం పై బురద జల్లే ప్రయత్నం చేసారు. పదేళ్ల మా పాలనలో 6,47,479 రేషన్ కార్డులును ఇచ్చాం. 20,69,033 మంది లబ్ధిదారులు అదనంగా రేషన్ ఇచ్చినం. కేసీఆర్ మానవతా దృక్పథంతో ఆలోచించారు. నిరుపేదలకు రేషన్ కార్డులు రావాలనే ఆలోచనతో ఆదాయ పరిమితి సడలించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఆదాయ పరిమితి గ్రామీణంలో 60వేలు, పట్టణంలో 75వేలు ఉంటే, దాన్ని గ్రామీణంలో లక్షా 50వేలకు, పట్టణంలో 2.50 లక్షలకు పెంచారు.అంగన్ వాడీలు, ఆశాలు, ప్రైవేటు,




ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు, పేద వర్గాలకు లాభం జరగాలని నిర్ణయం తీసుకున్నరు.

గ్రామీణ ప్రాంతాల్లో లక్షా 50వేల ఆదాయ పరిమితిని, ద్రవ్యోల్బణం ప్రకారం గుణిస్తే 2.55లక్షలు అని తేలుతుంది. అంటే ఆనాటి లక్షా 50వేలు, ఈ నాటి 2.55లక్షలతో సమానం. అదే విధంగా పట్టణ ప్రాంత 2లక్షల ఆదాయ పరిమితిని, ద్రవ్యోల్బణం ప్రకారం గుణిస్తే 3.40లక్షలు అని తేలుతుంది. అంటే ఆనాటి లక్షల ఆదాయం, నేటి 3.40లక్షలకు సమానం. పెరిగిన ద్రవ్యోల్బణాన్ని అనుసరించి రేషన్ కార్డుల కోసం కుటుంబ ఆదాయ పరిమితిని గ్రామీణ ప్రాంతాల్లో 2.55లక్షలుగా, పట్టణ ప్రాంతాల్లో 3.40లక్షలుగా సవరించి పెంచాలని, తద్వారా పేదలందరికీ లబ్ది చేకూరే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

ద్రవ్యోల్బణం లెక్కల ఆధారంగా పరిగణించి రేషన్ కార్డులు ఇస్తే ఎంతో మంది నిరుపేదలు రేషన్ కార్డులు పొందుతారు. మా ప్రభుత్వ నిర్ణయం వల్ల జర్నలిస్టులు, ప్రైవేటు ఉద్యోగులు, చిరు ఉద్యోగులు ఇలా ఎంతో మంది తెల్ల రేషన్ కార్డులు పొందారు. అభయహస్తం మేనిఫెస్టోలో రేషన్ కార్డులపై సన్నబియ్యం సరఫరా చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి 400 రోజులు గడుస్తున్నా అతీగతీ లేదు. మేనిఫెస్టోలో మేము పెట్టక పోయినప్పటికీ రేషన్ కార్డు ద్వారా కుటుంబంలోని ఒక్కో వ్యక్తికి ఇచ్చే బియ్యంను 4కేజీల నుంచి 6కేజీలకు పెంచడం జరిగింది.

వ్యవసాయ కూలీలకు భరోసా ఇచ్చే విషయంలో ప్రభుత్వం కోతలు విధించడడం దుర్మార్గం. ఎన్నికల మేనిఫెస్టోలో వ్యవసాయ కూలీలందరికి ఏడాదికి 12వేలు ఇస్తాం అన్నరు. ధరణిలో పెట్టి ఆ 25లక్షల్లో గుంట భూమి ఉన్నా ఇచ్చేది లేదని అర్హుల సంఖ్యను ఆరు లక్షలకు కుదించారు.కోటి మంది వ్యవసాయం కూలీలు ఉంటే, ఆరు లక్షల మందికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తరట. ఇదేం న్యాయం. వ్యవసాయ కూలీలు నిర్ణయించాల్సింది గ్రామాల్లో. ఎవరు కూలీ పోతున్నరో అడగాలి. అంతేగాని కంప్యూటర్ డేటా ఆధారంగా కోతలు విధించడం దుర్మార్గం. 94శాతం మందికి ఎగ్గొట్టి, ఆరు శాతం మందికి చేస్తున్నం అంటే ఏమన్నట్లు. ఎగ్గొడుతున్నట్లే కదా. ఆదిలాబాద్, బేల మండలం సైదాపూర్ గ్రామం బ్యాంకు వాళ్లు అప్పు కట్టాలంటే, బ్యాంకులోనే పురుగుల మందు తాగి రైతు చనిపోయిండు. రుణమాఫీ అయిపోతే ఈ రైతు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నడు. ఈ రైతును చంపింది ముమ్మాటికి కాంగ్రెస్ పార్టీనే. కోటి మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నం. అర్హులందరికి రేషన్ కార్డులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. లేదంటే గ్రామ గ్రామాన నిరసనలు తప్పవు. ప్రభుత్వాన్ని ఎక్కడిక్కడ నిలదీయాలని బీఆర్ఎస్ పక్షాన పిలుపునిస్తున్నాం' అని అన్నారు.

## రైతు ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యత : కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్**

ఆదిలాబాద్ రైతు జాదవ్ దేవ్‌రావ్ ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యతని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ చేయకపోవడంతో ఆదిలాబాద్ జిల్లా బేల మండలం రేణిగూడకు చెందిన రైతు జాదవ్ దేవ్‌రావ్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరిట రుణం ఉన్న బ్యాంకులోనే పురుగుల మందు తాగి ఆ రైతు బలన్మరణానికి పాల్పడ్డాడంటే.. ఆ రుణభారం రైతన్నను ఎంత మానసిక వేధనకు గురిచేసిందో అర్థమవుతుందన్నారు. ఆ అన్నదాత నిండు జీవితం బలికావడానికి రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పేరిట చేసిన మహామోసంతోపాటు రైతు వ్యతిరేక విధానాలే ప్రధాన కారణమన్నారు. పదేళ్లపాటు రాజుగా బతికిన రైతన్న ఈ రోజు ఇందిరమ్మ రాజ్యంలో అవస్థల పాలవుతూ అరిగోస పడుతున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అన్నదాతలను పట్టించుకోవడం లేదన్నారు. అప్పులు తీరక అన్నదాతలు బలవన్మరణాలకు పాల్పడుతున్నా కనికరం లేని కాంగ్రెస్ సర్కారులో ఏమాత్రం చలనం లేదన్నారు. అధికారంలోకి రాగానే రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని ముఖ్యమంత్రి మాట తప్పడం.. రైతు భరోసా ఎత్తకొట్టడం వల్లే రైతు అన్యాయంగా బలయ్యారన్నారు.

## క్వింటాల్ కందులకు
# రూ. 7550 మద్దతు ధర అందించాలి..

- **కందుల కొనుగోలుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు..**
- **అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



**బలగం టీవీ , సిరిసిల్ల**

ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ లో వచ్చే కందుల పంటను మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ కందుల కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ లో కందుల కొనుగోలు యాక్షన్ ప్లాన్ ను అధికారులు అదనపు కలెక్టర్ కు వివరించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1129 ఎకరాల 28 గుంటల భూమిలో కందుల సాగు జరిగిందని, ప్రస్తుత వానాకాలం 6 వేల 211 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, మార్క్ ఫెడ్ ద్వారా రైతులకు మద్దతు ధర వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. వానాకాలం 2024-25 సీజన్ లో ప్రతి క్వింటాల్ కందుల పంటకు 7550 రూపాయల మద్దతు ధర తప్పనిసరిగా అందించాలని అన్నారు. కందుల పంట కొనుగోలుకు వ్యవసాయ సహకార సంఘాలు, డిసిఎంఎస్ లలో అనువైన కేంద్రాలను గుర్తించాలని సహకార అధికారికి సూచించారు.

కందుల పంట ను కొనుగోలు కేంద్రాల నుంచి సమీపంలో ఉండే స్టోరేజ్ పాయింట్ కు తరలించేందుకు వీలుగా రవాణా ఏర్పాట్లు చేసుకోవాలని, మార్క్ ఫెడ్ వద్ద అవసరమైన మేరా గన్ని బ్యాగులు, వెయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు ఇతర సామాగ్రి అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని . జిల్లాలో వ్యవసాయ మార్కెట్ యార్డులు, ఎఫ్ సి.ఐ గోదాములు , ఇతర గోదాముల వద్ద అందుబాటులో ఉన్న స్థలాన్ని పరిశీలించి కందుల స్టోరేజ్ కోసం ఎంపిక చేయాలని, కందులు కొనుగోలు అంశంలో సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని, కందులు కొనుగోలు వద్ద హమాలీల కొరత రాకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెఫెడ్ అధికారి హబీబ్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలిబేగం, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వసంత లక్ష్మి, శాఖ మేనేజర్ రజిత, వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యధర్శులు , సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# కీర్తనల ద్వారా ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది



- **ప్రాచీన కళలను కాపాడే దిశగా చర్యలు..**
- **రాజన్న ఆలయ అభివృద్ధి కి ప్రభుత్వం కట్టుబడి ఉంది..**

**బలగం టీవీ , వేములవాడ**

త్యాగరాజ ఉత్సవాలు కళలను కాపాడుతూ, భక్తి భావం పెంపొందించడానికి ఎంతగానో ఉపయోగపడతాయని,కీర్తనల ద్వారా ఒక ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న నాద బ్రహ్మ లయ బ్రహ్మ సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి 72వ ఆరాధన ఉత్సవములను శనివారం రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలకు చరిత్ర ఉన్నదని,గత ఏడు దశాబ్దాలుగా ప్రతి ఏటా ఆరాధన ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహించబడుతున్నాయని,ఇది చాలా గొప్ప విషయమని మనకు చాల గర్వకారణం అని అన్నారు.కళాకారులలో ఉన్నా కళలను వెలికి తీయడానికి త్యాగరాజ ఉత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయని,దక్షిణ కాశీగా పేరుగాంచిన రాజన్న ఆలయంలో 72 సంవత్స రాలుగా నిర్విరంగా కొనసాగడం అభినంద నీయంఅని అన్నారు. పెద్దలు సాంబయ్య ప్రారంభించిన ఈ ఉత్సవాలు నేటికీ నిర్విరామంగా కొనసాగు తున్నాయని,రామభక్తి పరవశంతో వేలాది మహత్తరమైన కీర్తన రచించారని,వారి జీవిత చరిత్ర ను భావితరాల తెలియజేయాలని,

త్యాగరాజు 800 కీర్తనలు 24000 రచనలు రచించారని అన్నారు.జగదానందకారక అనే కీర్తన ద్వారా శ్రీరాముని కున్న 108 పేర్లను ప్రస్తావిస్తూ ప్రఖ్యాత భక్తి విజయం నౌక చరితం అనే నాట్య రూపకాలను రచించాడని అన్నారు రాజన్న ఆలయాల్లో కళలను కాపాడే విధంగా సాంస్కృతిక కళాశాల నడపడం జరుగుతుందని,దానిని అప్ గ్రెడ్ చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రుల సహకారాలతో రాజన్న ఆలయంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని అన్నారు.రాజన్న భక్తులకు మెరుగైన వసతలు కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటుఽ న్నామని,రాబోవు రోజుల్లో వచ్చే భక్తులకు దృష్టిలో పెట్టుకొని మరో 100 సంవత్సరాలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామనిఅన్నారు. పొన్నం ప్రభాకర్, నా కోరిక రాజన్న ఆలయంలో అన్నదాన సత్రం నిర్మాణం చేపట్టడం జరుగుతుందని,ప్రతీ రోజూ 10 వేల మంది భక్తులు భోజనం చేసేలా అన్నదాన సత్రం నిది 100 కోట్లకు పెంచేదుకు కృషి చేస్తావని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ రూ. 45 లక్షలు, తాను రూ. 10 లక్షలు విరాళంగా ఇవ్వడం జరిగిందని అన్నారు.

# ఎక్కడైతే శాంతి భద్రతలు అదుపులో ఉంటాయో అక్కడే అభివృద్ధి సాధ్యం..

- **విద్యార్థులు మంచిని స్వికరించి చెడుకు దూరంగా ఉండాలి..**
- **విద్యార్థులు సైబర్ నేరాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ పై అవగాహన పెంపొందించుకోవాలి..**
- **ఖాకీ కిడ్స్" కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్..**




**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

ఎక్కడైతే శాంతి భద్రతలు అదుపులో ఉంటాయో అక్కడే అభివృద్ధి సాధ్యంమని, పోలీసు శాఖ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్ అన్నారు.శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఖాకీ కిడ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ హాజరై,జిల ఎస్పీ అఖిల్ మహాజన్, లైబ్రరీ చైర్మన్ సత్యనారాయణ తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు చేరువగా యువతకు క్రీడా పోటీలు,ఆరోగ్య శిబిరాలు,డ్రైవింగ్ లైసెన్స్, సీసీ కెమెరాల ఎర్పాటు మొదలగు సామాజిక కార్యక్రమాలు చేపడుతూ,శాంతి భద్రతల పరిరక్షణతో పాటుగా ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా జిల్లా పోలీసులు పని తీరు అభినందనీయం అన్నారు.సైబర్ నేరాల నియంత్రణయే లక్ష్యంగా విద్యార్థి దశ నుండి విద్యార్థులకు సైబర్ నేరలపై,ట్రాఫిక్ సిగ్నల్స్ పై అవగాహన కల్పించి సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాడమే లక్ష్యంగా "ఖాకీ కిడ్స్" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు జిల్లా ఎస్పీ.

ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరగాళ్లు కొంత కొంత మోసలతో ప్రజలను మోసాగిస్తున్నారని, అట్టి మోసాల బారిన ప్రజలు పడకూడదనే ఉద్దేశ్యంతో ప్రతి పోలీస్ స్టేషన్లలో సైబర్ వారియర్ లను ఎంపిక చేసి వారికి సైబర్ నేరాలు జరుగు విధానం,ట్రాఫిక్ నియమలపై శిక్షణ ఇచ్చి జిల్లాలో ఉన్న అన్ని కళాశాల్లో, పాఠశాలల్లో విద్యార్థులకు ఇంటర్నెట్ దుర్వినియోగం, ఆన్లైన్ మోసాలు,సైబర్ మోసాల భారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నారు. విద్యార్థులు ఖాకి కిడ్స్ కార్యక్రమన్ని సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులకి,కుటుంబ సభ్యులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థులు మంచిని స్వీకరించి చెడుకు దూరంగా ఉండాలని, ఎస్పీ అఖిల్ మహాజన్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి లను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్ లో ఉన్నత స్థానాల్లో స్థిరపడి తల్లితండ్రులకు,పుట్టిన గ్రామానికి గొప్ప పేరు తీసుకురావాలని, సంకల్పం, మనోబలం ఉంటే మనం అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చాని అన్నారు.విద్యార్థుల జీవితంలో పదవ తరగతి పరీక్షలు మొదటి అడుగని,మార్చ్ లో నిర్వహించే పదవ తరగతి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. రాజన్న ఆలయంలో ఇటీవల జరిగిన పాప అపహరణ కేసును చాకచక్యంగా ఛేదించి రాష్ట్ర స్థాయిలో జిల్లా పోలీస్ వారు మంచి పెరు తెచ్చుకున్నారని అన్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ప్రజలు పిల్లలు చెప్పితే తప్పక పాటిస్తారనే ఉద్దేశ్యంతో ఖాకీ కిడ్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్లో ఉన్న సైబర్ వారియర్లకు సైబర్ నేరాలకు జరుగు విధానం,ఎలా అరికట్టాలి, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించి రానున్న మూడు నెలల్లో జిల్లాలో ఉన్న అన్ని కళాశాలలో,పాఠాశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, అనంతరం గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పించడం జరుగు తుందన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకి దూరంగా ఉండాలని, ప్రతి ఒక్కరు సోషల్ మీడియాలలో వ్యక్తిగత గోప్యత పాటించాలని, ప్రస్తుతం ఎక్కువగా వస్తున్న డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, ఓటిపి ఫ్రాడ్, సోషల్ మీడియాలో వచ్చే ఉద్యోగ ప్రకటనలు,అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే విడియో కాల్స్ కుఫ్రాడ్, ఓఎల్ఎక్స్ ఫ్రాడ్ లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ స్వరూప,డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి,సి.ఐ లు కృష్ణ, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, ఆర్.ఐ లు మధుకర్, రమేష్ ,ఎస్.ఐ లు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ముగిసిన వాహనాల,వస్తువుల వేలం: జిల్లా ఎస్పీ

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

జిల్లాలో పలు సందర్భాల్లో స్వాధీన పరుచుకున్న/రోడ్ల మీద వదిలేసిన వాహనాలు మొత్తం 54 వాహనాలు వేలంపాట శనివారం రోజున జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్లో నిర్వహించగా,ఈ వేలం నిర్వహణ ద్వారా వచ్చిన రూ.మొత్తం 5,36,000/- రూపాయలు.

ఐ జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో సర్వీస్ లో లేని కిట్ ఆర్టికల్స్, పాతబడిన టెంట్లు, ఇనుప సామాగ్రి,జెనరేటర్, స్టోర్ మొదలగు వసువులను వేలంపాట నిర్వహించగా,ఈ వేలం నిర్వహణ ద్వారా వచ్చిన రూపాయలు మొత్తం 1,54,100/- రూపాయల మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు....60 కి పైగా కొనుగోలుదారులు ఈ వేలం పాటలో పాల్గొన్నారు. ఈ వేలం పాటలో



అదనపు ఎస్పీ చంద్రయ్య గారు,స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ మురళి కృష్ణ,ఆర్.ఐ లు మధుకర్, రమేష్ ,ఆర్.ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడాకారులు ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలి

- **జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

క్రీడాకారులు ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.. శనివారం వేములవాడ పట్టణ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రభుత్వ విప్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే జీవితంలో ఎంత పెద్ద ఇబ్బందులు ఎదురైన ఎదుర్కొనికి దృఢంగా ఉంటారని పేర్కొన్నారు.. క్రీడల వల్ల మానసిక ఉల్లాశం శరీరక దృఢత్వం లభిస్తుందన్నారు. మన ప్రాంతం కబడ్డీ,వాలీబాల్ క్రీడలకు పెట్టింది పెరన్నారు..యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రిడలపట్ల మక్కువ పెంచుకోవాలని అన్నారు.. క్రీడాకారులు మ్యాట్లు కావాలని కోరగానే షాప్ చైర్మన్ శివసేన రెడ్డితో మాట్లాడగా తప్పకుండా ఇస్తానని హామీ ఇచ్చారని తెలిపారు..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారని రానున్న ఒలంపిక్ పోటీల్లో పాల్గొనడానికి రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభించడం జరుగుతుందన్నారు.. కబడ్డి,వాలీబాల్ స్టేట్ మీట్ కు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. గంజాయి రహిత రాష్ట్రంగారాష్ట్రాన్ని మార్చడానికి ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు.. ప్రతిభా ఉన్న క్రీడాకారులకు ప్రభుత్వం తరుపున ప్రోత్సాహకం అందించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.. గతంలో నూకలమర్రి గ్రామంలో స్టేట్ మీట్ నిర్వహించినప్పుడు శ్రీధర్ బాబు వచ్చారని గుర్తు చేశారు..మన ప్రాంతంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం లో స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభం చేస్తే ఇతరులు వాట్సాప్ యూనివర్సిటీలో ప్రారంభం చేసి ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొడుతున్నారు.. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్వాహ కులకు సూచించారు.వేములవాడ ఏఎస్పి శేషాద్రి రెడ్డి, జిల్లా కబడి అసోసియేషన్ అధ్యక్షులు ముస్కు మల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు రాములు, సెక్రటరీ తిరుపతి,పట్టణ సీఐ వీరా ప్రసాద్ , మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ మహేష్, పట్టణ అధ్యక్షులు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, సంఘ స్వామి యాదవ్,వకలాభరణం శ్రీనివాస్, కౌన్సిలర్లు క్రీడాకారులు పాల్గొన్నారు..

# చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టు...



- కెప్టెన్ గా రోహిత్ శర్మ.. వైస్ కెప్టెన్‌గా గిల్
- ఫిబ్రవరి 19 నుంచి ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ

**బలగం టీవీ, హైదరాబాద్**

చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టును బీసీసై ప్రకటించింది. రోహిత్ శర్మ కెప్టెన్సీలో 15 మందితో కూడిన స్క్వాడ్‌ను అనౌన్స్ చేసింది. సిరాజ్, శాంసన్‌కు చోటు దక్కలేదు. సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్, కెప్టెన్ రోహిత్ శర్మ కలసి స్క్వాడ్‌ను అనౌన్స్ చేశారు. యంగ్ బ్యాటర్ శుబ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ టీమ్‌లో ఇంకా ఏయే

చాంపియన్స్ ట్రోఫీ టీమ్‌లో రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ ఓపెనర్లుగా ఉన్నారు. వీళ్లతో పాటు సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, యశస్వి జైస్వాల్, స్టైలిష్ ప్లేయర్లు కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ టాపార్డర్‌లో ఉన్నారు. పేస్ ఆల్‌రౌండర్ కోటాలో హార్దిక్ పాండ్యా చోటు దక్కించుకున్నాడు. వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్‌ను తీసుకున్నారు. స్పిన్ ఆల్‌రౌండర్లుగా అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా ఎంపికయ్యారు. ప్రధాన స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్‌ను తీసుకున్నారు. మహ్మద్ షమి, అర్ష్‌దీప్ సింగ్‌తో కలసి పేస్ అటాక్‌ను నడిపించనున్నాడు జస్‌ప్రీత్ బుమ్రా. మహ్మద్ సిరాజ్‌కు చోటు దక్కలేదు. రంజీల్లో అదరగొడుతున్న కరుణ్ నాయర్‌నూ సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోలేదు. ఇటీవల ఆస్ట్రేలియా సిరీస్‌లో రాణించిన తెలుగు బ్యాటర్ నితీశ్ కుమార్ రెడ్డికి కూడా వన్డే జట్టులో చోటు దక్కలేదు. శ్రీలంకతో జరిగిన వన్డేలకు గిల్ కెప్టెన్‌గా చేశాడని, అతని గురించి డ్రెస్సింగ్ రూమ్ నుంచి మంచి అభిప్రాయాలు వచ్చాయని, అందుకే అతన్ని వైస్ కెప్టెన్‌గా నియమిస్తున్నట్లు అగార్కర్ తెలిపాడు.

**టీమిండియా జట్టు :**

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్ మాన్ గిల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, రిషబ్ పంత్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీ, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్.

# శివుని ఆజ్ఞతోనే 'కన్నప్ప' రూపుదిద్దుకుంటోంది



● బెంగళూరులో ప్రమోషన్స్‌లో మంచు విష్ణు

**బలగం టీవి, హైదరాబాద్**

మంచువిష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా 'కన్నప్ప' చిత్రం భారీ ఎత్తున రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. 2025 ఏప్రిల్ 25న ఈ సినిమా గ్రాండ్ గా విడుదల కానుంది. ఇక ఈ మూవీ ప్రమోషన్స్ కు బెంగళూరులో తెర లేచింది. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హీరో మంచు విష్ణు, దర్శకుడు ముఖేశ్ కుమార్ సింగ్, సీనియర్ నటుడు శరత్ కుమార్, స్టార్ కొరియోగ్రాఫర్ ప్రభుదేవా, కన్నడ నిర్మాత రాక్ లైన్ వెంకటేశ్ పాల్గొన్నారు.విష్ణు మంచు మాట్లాడుతూ... "కన్నప్ప ప్రమోషన్స్‌ను కన్నడ నేల నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉంది. కన్నడ కంఠీరవ రాజ్ కుమార్ గారు మొదటి సారిగా కన్నప్ప చిత్రాన్ని చేశారు. ఆ తరువాత శివ రాజ్ కుమార్ గారు కూడా చేశారు. తెలుగులో స్వర్గీయ శ్రీ కృష్ణంరాజు గారు బాపు రమణ దర్శకత్వంలో కన్నప్ప చేశారు. మళ్లీ ఇప్పుడు మేం కన్నప్ప కథను చెప్పబోతోన్నాం. కన్నప్ప ఎవరు? ఆయన కథ ఏంటి? ఆయన చేసిన గొప్ప కార్యాలు ఏంటి? అని ఈ తరానికి క్లియర్‌గా చూపించాలనే ఈ కన్నప్ప సినిమాను చేస్తున్నాం. ఇక, గతంలో వచ్చిన కన్నప్ప చిత్రానికి, తమ కన్నప్ప చిత్రానికి తేడా ఉందని, ఇప్పుడు వస్తోందని తన వెర్షన్ అని మంచు విష్ణు స్పష్టం చేశారు. ముఖేష్ కుమార్ సింగ్ బుల్లితెరపై ఓ లెజెండ్. మహాభారతం సీరియల్‌ను అద్భుతంగా తెరకెక్కించారు. ఇండియా నుంచి టీంను న్యూజిలాండ్‌కు తీసుకెళ్లాం. ఇతర దేశాల నుంచి కూడా టెక్నీషియన్లను తీసుకొచ్చాం. శరత్ కుమార్ గారు సెట్‌కి ఆన్ టైంకి వచ్చేవారు. ప్రభు దేవా అన్న అడిగిన వెంటనే మా ప్రాజెక్ట్ కోసం వచ్చారు. అసలు ఈ కథను అనుకున్నప్పుడు రాక్ లైన్ వెంకటేష్ గారికే ఫోన్ చేసి చెప్పాను. అద్భుతంగా ఉంటుంది చేయ్ అని ధైర్యాన్ని ఇచ్చారు. శివుని ఆజ్ఞతోనే ఈ చిత్రం ప్రారంభమైందని అనిపిస్తుంది. నాకు ఈ కన్నప్ప ఎంతో ప్రత్యేకం. ఆర్ఆర్ అవ్వక ముందే రాక్ లైన్ వెంకటేష్ గారు ఈ మూవీని చూశారు. అద్భుతంగా వచ్చిందని భరోసానిచ్చారు. ఇక ఆ శివుని ఆశీస్సులతో మేం ఏప్రిల్ 25న రాబోతున్నాం" అని వివరించారు.

దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ... "కన్నడలో రాజ్ కుమార్ గారు మొదటగా కన్నప్ప చిత్రాన్ని చేశారు. ఆ సినిమా చూసిన తరువాత కన్నప్ప సినిమాను మళ్లీ చేయడం, ఆ పాత్రను మళ్లీ రీక్రియేట్ చేయడం అంటే మామూలు విషయం కాదు. కానీ నాకు అద్భుతమైన నటీనటులు దొరికారు. సినిమాకు గొప్ప ఆర్టిస్టులంతా కలిసి వచ్చారు. వారంతా అద్భుతంగా నటించారు. విష్ణు, మోహన్ బాబు గారు ఈ సినిమా కోసం చాలా కష్టపడుతున్నారు. ఈ సినిమా విజువల్ ట్రీట్ ఇచ్చేలా ఉంటుంది" అని వివరించారు.



# ఎంపీని పెండ్లాడనున్న రింకు సింగ్

**బలగం టీవి, హైదరాబాద్**

భారత క్రికెటర్ రింకు సింగ్ త్వరలో ఓ ఇంటి వాడు కాబోతున్నాడు. సమాజ్ వాదీ పార్టీకి చెందిన ఎంపీ ప్రియ సరోజ్‌ను రింకు పెళ్లి చేసుకోబోతున్నాడు. ఈ విషయాన్ని ప్రియా తండ్రి, యూపీలోని కెరకట్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన తుఫానీ సరోజ్ ధ్రువీకరించారు. పెళ్లి విషయంపై అలీఘఢ్‌లో రింకు తండ్రితో చర్చించినట్లు ఆయన వివరించారు. పార్లమెంట్ సమావేశాల తర్వాత నిశ్చితార్థం, వివాహ తేదీలను నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు. నిశ్చితార్థం లక్నోలో జరుగుతుందని చెప్పారు.

జౌన్‌పూర్‌లోని మఛ్లిషహర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి సమాజ్‌వాదీ పార్టీ టికెట్‌పై ప్రియా సరోజ్ గెలుపొందారు. అయితే, రింకు సింగ్, ప్రియా నిశ్చితార్థం జరిగినట్లు వచ్చిన వార్తలు తుఫానీ సరోజ్ కొట్టిపడేశారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలిపారు. ఇంకా ఇద్దరి నిశ్చితార్థం జరుగలేదని చెప్పారు. గత గురువారం రింకు కుటుంబాన్ని అలీగఢ్‌లో కలిసినట్లు పేర్కొన్నారు. వివాహం విషయంలో చర్చలు అర్థవంతంగా జరిగాయన్నారు. పార్లమెంట్ సమావేశాల జనవరి నెలాఖరు నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతాయన్నారు. ఈ సమావేశాలు ముగిసిన తర్వాత నిశ్చితార్థం, వివాహ తేదీలను నిర్ణయించున్నట్లు తెలిపారు.



# ఖోఖో సెమీస్‌కు భారత్

**బలగం టీవి, హైదరాబాద్**

మొట్టమొదటి ఖోఖో ప్రపంచ కప్‌లో భారతమహిళలు, పురుషుల జట్లు సెమీఫైనల్లో అడుగుపెట్టాయి. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ప్రియాంక ఇంగ్లే సారథ్యంలో మహిళల జట్టు 109–16 పాయింట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. ప్రతీక్ వైకర్ కెప్టెన్సీలో పురుషుల జట్టు 100–40 పాయింట్ల తేడాతో శ్రీలంకపై విజయం సాధించింది. కాగా, ఈ ప్రపంచ కప్‌లో భారత మహిళల జట్టు వరుసగా నాలుగోసారి 100 పాయింట్ల మార్క్‌ను అందుకోవడం విశేషం. శనివారం జరిగే సెమీఫైనల్లో మహిళల జట్టు దక్షిణాఫ్రికాతో తలపడుతుంది. మరో సెమీస్‌లో నేపాల్–ఉగాండా ఢీకొంటాయి. ఇక భారత పురుషులు సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాతో అమీతుమీ తేల్చుకుంటారు. రెండో సెమీస్‌లో ఇరాన్–నేపాల్ తలపడతాయి.





# సంక్రాంతికి వస్తున్నాం సెలబ్రేషన్స్‌లో మహేశ్‌బాబు

**బలగం టీవి, హైదరాబాద్**

విక్టరీ వెంకటేష్, అనిల్ రావిపూడిల కాంబినేషన్‌లో జనవరి 14న వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా సూపర్ హిట్ అవ్వడంతో మూవీ టీమ్ ఆనందం వ్యక్తం చేసోఓతంది. తాజాగా ఈ మూవీ టీమ్ సక్సెస్ లో సూపర్ స్టార్ మహేష్ బాబు కూడా పాల్గొన్నారు. మహేష్ బాబుతో సంక్రాంతికి వస్తున్నాం టీమ్ దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే సంక్రాంతికి వస్తున్నాం సినిమా చూసిన మహేష్ బాబు చిత్రయూనిట్ కు కంగ్రాట్స్ చెప్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మహేష్ బాబు ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. దర్శకుడు అనిల్ రావిపూడి, వెంకటేష్, హీరోయిన్స్ ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరితో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్‌లో శ్రీరాం బాలాజీ జోడి ఓటమి

**బలగం టీవి, హైదరాబాద్**



ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్‌లో ఎన్ శ్రీరాం బాలాజీ, మిగుల్ ఏంజెల్ రియాస్ వరేలా జోడి.. రెండో రౌండ్‌లో ఓడిపోయింది. భారత ఆటగాడు బాలాజీ, మెక్సికో ప్లేయర్ వరేలా.. ఇద్దరూ గట్టి పోటీ ఇచ్చినా.. 6–7 (7), 6–4, 3–6 స్కోరుతో పోర్చుగీస్ జోడి నునో బోర్జెస్, ఫ్రాన్సిస్కో కాబ్రల్ చేతిలో పరాజయం చవిచూశారు. సుమారు రెండు గంటల 9 నిమిషాల పాటు మ్యాచ్ రసవత్తరంగా సాగింది. తొలి సెట్ 56 నిమిషాల పాటు హెూరాహెూరీగా సాగింది. ట్రైబేకర్‌లో బోర్జెస్, కాబ్రల్ జోడి వత్తిడిలో పైచేయి సాదించింది. ఆ తర్వాత రెండో సెట్‌లో ఇండో–మెక్సిన్ జోడి తీవ్రంగా పోరాడింది. చాలా ఈజీగా ఆ సెట్‌ను సొంతం చేసుకున్నది. కీలకమై మూడవ సెట్‌లో బోర్జెస్–కాబ్రల్ జోడి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది.

# మార్చి 29న "మ్యాడ్ స్క్వేర్"

**బలగం టీవి, హైదరాబాద్**




నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ లు హీరోలుగా చేసిన "మ్యాడ్" భారీ హిట్ కాగా ఈ సినిమాకి సీక్వెల్ గా "మ్యాడ్ స్క్వేర్" ని మేకర్స్ అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. కాగా ఇపుడు ఫైనల్ గా ఈ సినిమా రిలీజ్ డేట్ ని ఫిక్స్ చేసేసారు. ఈ అవైటెడ్ క్రేజీ సీక్వెల్ ని మార్చ్ 29న గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నట్టుగా అనౌన్స్ చేసేసారు. ఈ చిత్రానికి కూడా భీమ్స్ సంగీతం అందిస్తుండగా సితార ఎంటర్టైన్మెంట్స్ ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ వారు కలయికలో సంయుక్తంగా నిర్మాణం వహిస్తున్నారు.